

# నివురుగప్పిన నిప్పు

ప్రేమించినవారే ద్వేషిస్తారు... పెద్దవారి ఆగ్రహానికి ద్వేషం కారణంగా ఊహించుకుని, అంతరాలు సృష్టించుకుంటే, అనర్థాలు వాటిల్లుతాయి. పంచదార గుళికపై చేదుపూత పూస్తే...

'గంటి'

వెంకమ్మగారిని ఇక్కడే దహనం చేశారు. శ్మశానం ప్రక్కనించి ఉన్న కాలిబాటపై బండిలో పోతూన్న రాజేశ్వరికి ఆ ప్రదేశం చూడగానే దుఃఖం వరదలా పొంగింది. వెంకమ్మగారిని కాల్చిన ఆనవాలు పచ్చగడ్డిమీద కనిపిస్తూంది. భౌతికావశేషాలు పక్కనున్న నదిలో కలిసిపోయాయి.

ఆవిడ చనిపోయినా, ఆవిడ జ్ఞాపకాలు చిరకాలం ఉండే పనులు చేసింది. బండిలో ఉన్న పిల్లలకేసి, భర్తకేసి ఒక్కసారి చూసింది. అందరూ ఏదో ఆలోచిస్తున్నారు. ఆఖరి పిల్లమాత్రం కునికిపాట్లు పడుతూంది.

పదిహేను రోజులక్రితం తను ఇక్కడికి రాకముసుపు పరిస్థితికీ, ఇప్పటి పరిస్థితికీ ఎంత తేడా!

గోపాలం పెద్దవాడు. పి. యు. సి. చదువుతున్నాడు. పరీక్షఫీజుకు డబ్బు లేదు. ఇంటిలో ఏడుస్తూ కూర్చున్నాడు. విజయలక్ష్మి రెండోది రెండునెలల. జీతం ఇవ్వలేదని సంగీతంమాస్టారు అడిగాడని అభిమానంతో ఇంట్లోనించి కదలలేదు. ఇంకా స్వాభిమానం అర్థంకాని ఆఖరిది రోజా దేనికో ఒకదానికి ఏడుస్తూనేఉండేది.

ఇక భర్త సరేసరి. ఒక చెయ్యి పనిచెయ్యకుండా అయిపోయింది ప్రమాదంలో. గుండెకు పెద్ద షాకు ఇచ్చింది. సరిగ్గా నడవనుకూడా చేతకాదు ఆయనకు.

తను ప్రయివేటు స్కూల్లో టీచరు. జీతం నూటయాభై. హెడ్‌మాస్టరికి కొంత నెలనెలా ఇస్తూ ఉండాలి. ఆవిడ కొంత ఉంచుకుని, లేక తను ఇవ్వవలిసినదాన్ని మిగుల్చుకుని మేనేజరుకి మామూలు ఇవ్వాలి.

దినదినమూ ఒక దుస్స్వప్నంగా, జీవితమొక పెద్ద శాపంగా రోజులు బరువుగా వెళ్ళదీసేవారు అందరు.

గోపాలం మంచి ఎత్తరి. అయితేనం, పోషణలేని తోటకూరలా ఉండేవాడు. విజయలక్ష్మి అందమయినదీ, చురుకయినదీను. కాని కళ్ళలో ప్రాణాలుండేవి.

భర్తకి గుండెజబ్బు. మంచి ఖరీదైన మందులు వాడాలి. అంత తాహతు లేదు. వియ్యాటిమందు, క్షయ్మటి రోగం ఉండవుగా. గుండెజబ్బు గుండెని విడిచిపెట్టదు.

సుబ్బారావు అసలు తాయరు. పెద్ద ప్రాక్టీసు లేకపోయినా బాగానే జరిగేది. లేదు అనుకోకుండా ఉండేది. సుబ్బారావే ప్రోత్సహించి రాజేశ్వరిని ఉద్యోగానికి పంపింది. అయితే, ఒక ఇంట్లో ఇద్దరి సంపాదనా అని విధి ఎర్రగా చూసింది. ఫలితం, సుబ్బారావు పనికి పనికిరాకుండా అయిపోయాడు.

ఆ రోజు తను చాలా చికాగ్గా ఉంది. ఆఖరి పిల్ల చెయ్యి విరగగొట్టుకుంది. ఆవేళ చేతికి వేసిన పట్టీ విప్పుతారు. కొంత పైకం కావాలి కాంపౌండరుకి ఇవ్వడానికి. అసలు పట్టీ వేసేవాడే ఇవ్వాలి. పాపం, కొంచెం పాయిదాకి ఒప్పుకున్నాడు కాంపౌండరు.

పోస్టుమాన్ ఒక ఎక్స్‌ప్రెస్ డెలివరీ ఉత్తరం ఇచ్చి పోయాడు అప్పుడే. దానిలో ఏముందో తనకు తెలుసు. ఇదివరకటి ఉత్తరాలలాంటిది అదీను. అయినా విప్పింది

పోరు.

రాజేశ్వరి తమ్ముణ్ణి రాజాను.

"అక్కా! నేను నీకు సవితితమ్ముడనేకాని నువ్వు నన్ను ఎంతో ఆపేక్షగా చూసేదానివి. ఇద్దరం కలిసి అమ్మతో పోట్లాడడం గుర్తుందా? అది అంతా మర్చిపోయావా, అక్కా! అమ్మమీద నీ కోపం ఇంకా పోలేదా? ఇదివరకు రాసిన రెండు ఉత్తరాలకి జవాబు లేదు. అమ్మ నిన్ను చూడాలని ఎంతో కలవరిస్తూంది. ఇంకా రోజులలో ఉంది. అమ్మ నిదంకుపదాలే. నువ్వు ఇంట్లోనించి వెళ్ళిపోవడానికి అమ్మే కారణం. అమ్మ అందరి ఆడవాళ్ళలా ఏడవకపోయినా, ఆ కళ్ళలో బాధ నే నర్థం చేసుకోగలను. సంధి మొదలయింది. "రాజీ రాలేదా!" అంటూంది. నీమీద నిజంగా కోపం ఉంటే చచ్చిపోయేటప్పుడు ప్రేమ పుడుతుందంటావా?

నువ్వు వస్తావో, రావో తెలీని సందిగ్ధంలో ఉన్నాను. ఏదో ఒక మాట చెప్పమంటూంది. వస్తావని చెబితే శాంతిగానూ, లేకపోతే ఆవేదనతోను పోతుం దా జీవి.

పరిస్థితి కొంచెం ఆదుర్దాగా ఉంది. నీకు టెలిగ్రాము మనియార్డరు ఇవాళే కడతాను. నువు అది తీసుకుంటే వస్తున్నట్టూ, తీసుకోకపోతే రానట్టూ భావిస్తాను, ఇక్కడనించి ఎంక్వయిరీ చేసి. నేను ఇల్లు కదలడానికి లేదు. లేకపోతే నేనే వద్దును. ఇంక ఎవరినయినా పంపితే, ఈ సున్నితమైన విషయం ఏమవుతుందోనని ఊరుకున్నాను.

నువ్వు అమ్మకోసం కాకపోయినా, నాకోసం రావాలి. అమ్మ అంతిమఘడియలో నేను చెయ్యగలిగిన ఒకే ఒక సహాయం మిమ్మల్నిద్దర్నీ కలపడం.

వస్తావు కదూ!

ఇట్లు
నీ తమ్ముడు
—లక్ష్మీనారాయణ."

'ఇదివరకటి ఉత్తరాలకీ, దీనికీ తేడా ఉంది. ఇది అచ్చంగా తమ్ముడు రాసింది. మిగిలినవి తమ్ముడి చేత డిక్టేషను వ్రాయించిన ఉత్తరాలు. బహుశః అవి పిన్ని వ్రాయించిఉంటుంది. అందుకనే కరుగ్గా ఉన్నాయి' అనుకుంది రాజేశ్వరి.

ఇన్నాళ్ళూ తను మరిచిపోయింది తమ్ముణ్ణి. లక్ష్మీనారాయణది కొంచెం పిరికిగుండె. దాదాపు ఇరవై ఏళ్ళక్రితం తను పిన్నిఇంటితో తెగతెంపులు చేసుకున్నప్పుడు తన నిశ్చయాన్ని బలపరిచింది వాడు ఒక్కడే. అందుకే ఇల్లు విడవక తప్పలేదు.

రాజేశ్వరికి తల్లి జ్ఞాపకంలేదు. తండ్రికూడా లీలగా జ్ఞాపకమున్నాడు. రాజేశ్వరికి బాగా జ్ఞానం వచ్చేసరికి తెలిసింది, తను అమ్మా అని పిలుస్తున్నది తన్ను కన్న తల్లి కాదని. అప్పటినించి రాజేశ్వరికి తన తల్లిమీద ఒక విధమైన భేదభావం మొదలయింది. "అమ్మా" అని పిలవడం మానేసి, "పిన్నీ" అని మొదలుపెట్టింది పిలవడం.

వెంకమ్మగారు—అంటే రాజేశ్వరి సవతితల్లి—చాలా కరాఖండీమనిషి. భర్త బ్రతికిఉన్న కాలంలోను అంతకుముందు పుట్టింటిలోను ఆవిడ మాటకు ఎదురుండేది కాదు. ఆవిడ మాట ఫిరంగి ప్రేలినట్లుండేది. ఆవిడ పెళ్ళయిన తరవాత సువాసినిగా బ్రతికింది నాలుగయిదేళ్ళే. ఆ తరవాత ఉన్న కొద్దిపాటి ఆస్తితోను జాగ్రత్తగా పిల్లల్ని ... పుట్టింటివారిని చూసుకుంటూ వచ్చింది. దగ్గ బంధువులెవరూ లేరు.

రాజేశ్వరి "అమ్మా" అనిపిలవడం మానేసిన రోజున, "ఏమే, రాజీ! పిన్ని అని కొత్తపిలుపు మొదలు పెట్టావు? ఎవరైనా చెప్పేరేమిటే? చెప్పుడు మాటలు వినకే, తల్లీ. చెడిపోతావు" అంది.

ఆవిడ మామూలుగానే మాట్లాడినా, పీలగా ఉండే రాజేశ్వరి గుండె పిట్టలా వణికిపోయింది. వెంకమ్మ గారికి నంగినంగిగా మాట్లాడితే నచ్చదు.

"ఏమే, మాట్లాడవు? ఎవరు చెప్పారు?"

రాజేశ్వరికి ఏం మాట్లాడాలో అర్థంకాలేదు. ఏదో గొణిగింది. ఆవిడ గట్టిగా కేకలేసింది. ఇక ఆ రోజునించి ప్రతిరోజూ వెంకమ్మగారు తిట్టడానికి కారణాలు అనేకం కనిపించేవి రాజేశ్వరి ప్రవర్తనలో. ఆనకట్టకు బీటపడనంతవరకే గట్టి. ఆ తరవాత దిన దినమూ ఆ బీట పెద్దదవుతూ వచ్చేదుంది.

రాజేశ్వరి తిండిదగ్గరనించి వెంకమ్మగారే అజమాయిషీ చేసేది. ఒక రోజు తమ్ముడూ, రాజేశ్వరీ అన్నానికి కూర్చున్నారు.


"ఒసే, రాజీ! పెరుగు పోసుకోకు ఎక్కువగా. నీకు పడదు."

"కానీ. . . అక్కకు ఆకలిగా ఉందని చెప్పిందమ్మా. ఇంకొంచెం పెరుగు పోసుకోనీ, అమ్మా." లక్ష్మీనారాయణ అన్నాడు.

"ఓరి, బాలవెధవా! నాకే సలహా ఇస్తున్నావురా? నీ అక్క ఎంత తినగలదో నాకు తెలీదూ!"

"అయితే నాకు వద్దు. అక్కకి వేస్తేనే నాకు కావాలి. పెరుగు తప్పేడు పెట్టుకున్నాను కదా! అదంతా ఏం చేస్తావ్!" అన్నాడు కోపంగా వాడు.

వెంకమ్మగారు పిల్లల్ని ఎప్పుడూ కొట్టలేదు. ఆవిడ మాటకే, చూపుకే ప్రాణాలు పోయేవి వాళ్ళకి. ప్రతిరోజూ ఏదో ఒకదానికి అభ్యంతరం చెబుతూ ఉండేది వెంకమ్మగారు. రాజేశ్వరికి ఆవిడ పెద్ద రాక్షసి లాగ కనిపించేది. ఆవిడను ఎలాగైనా ఏడ్పేటట్టు చెయ్యాలని ఆ నీరు ... మిగిలిపోయింది. ఆవిడకి ఏ రాయో తగలాలని, నూతిలో జారి పడాలని, ఏ బండో గుద్దుకోవాలని మనస్సులో కోరుకునేది రాజేశ్వరి కసికొద్దీ. కనీసం ఆవిడ చెప్పినది "చెయ్యను" అని అనాలని అనుకునేది. కాని దానికికూడా ధైర్యం చాలేదికాదు.



ఉత్సాహం
ఫోటో—కె. రామకృష్ణరావు (చిత్తరంజన్)

ఆవిడని ఎదిరించాలనీ, చేతనయితే తిట్టాలనీ అనుకునేది రాజేశ్వరి. కాని మంత్రం వేసినదానిలా ఏం చెబితే అది చేసేది. తరవాత తనఅసమర్థతకి తిట్టుకునేది. తనను తనే అష్టకష్టాలు పడే బీదిఅమ్మాయికింద, సవతితల్లి తనని చంపాలని ప్రయత్నాలు చేస్తున్నట్టూ, అవన్నీ విఫలమయినట్టూ, ఎవరో మునో, లేకపోతే రాకుమారుడో తన సవతితల్లిని శిక్షించినట్టూ చిత్రించుకుని తృప్తిపడేది.

లోలోన కుములుతూ, కుళ్ళుతూ సంవత్సరాలు వెళ్ళదీసింది రాజేశ్వరి. రాజేశ్వరికీ, వెంకమ్మగారికీ ఎడం ఇంకొంచెం ఎక్కువయింది, ఒక సంఘటనతో, రాజేశ్వరి మిడిల్‌స్కూలునించి హైస్కూల్లో చేరినప్పుడు. రాజేశ్వరికి లెక్కలంటే తలనొప్పి. జనరల్ సబ్జక్ట్ తీసుకోవాలనుకుంది, అదికూడా తప్పదు కాబట్టి.

"రాజీ! లెక్కల్లో జనరల్ తీసుకున్నావుట. నేను వద్దని ముందు చెప్పానా?"

రాజేశ్వరి ఆశ్చర్యపోయింది, 'అప్పుడే ఈవిడ కెలా తెలిసిందా?' అని.

"ఏమిటే, అలా చూస్తావు! సుబ్బి చెప్పాడులే. రేపు వెళ్ళి స్పెషలు తీసుకో" అంది.

వెంకమ్మగారికి కొంచెం చదువు వచ్చు. ఆవిడ ఆసక్తితో కొన్ని నేర్చుకొంది. భర్త లేకపోడం మూలాన ఆవిడ కొన్ని విషయాలు నేర్చుకోడం వ్యవహారానికి తప్పనిసరి అయేది.

ఎన్నాళ్లనించో చూస్తూన్న అవకాశం రాజేశ్వరికి వచ్చింది. అవకాశం జారవిడుచుకోకూడదు. ధైర్యం కూడదీసుకుని బిగ్గరగా అంది.

"పిన్నీ! నాకు లెక్కలంటే తలనొప్పి. నాకు జనరలే చాలు."

"ఊహూ . . . నువ్వు స్పెషలు తీసుకోవలిసిందే. ఎలా రాదో చూస్తాను. ఆ సుబ్బిగాడు కాలేజీచదువు వెలగబెడుతున్నాడుగా! వాడు చెబుతాడులే. నీకు చదువు రాకపోతే రైతులతో వ్యవహారాలు ఎవరు చూస్తారు? ఆ పసివెధవకి అంత తెలివి ఎక్కడిది?"

"నావల్ల కాదు, పిన్నీ."

"వెధవ వేషా లెయ్యకు. చెప్పినట్టు చెయ్యి." కత్తిలా దూసుకుపోయాయి ఈ మాటలు రాజేశ్వరి మనస్సులో—ముఖ్యంగా ఆ 'వెధవ' అనేది. ఉప్పెనలా దుఃఖం వచ్చింది. కావలిసినవాళ్ళు చేసిన తప్పులు పెద్దవయినా చిన్నవిగా కనపడతాయి. ద్వేషం ఉన్నవాళ్ళు చిన్న మాట అన్నా ఎంతో బాధపెడతాయి. వెంకమ్మగారు మామూలుగా అన్న మాట రాజేశ్వరికి విపరీతమైన బాధ కలిగించింది. 'నన్ను వెధవ అని తిట్టుతుందా?' అని ఎన్నిసార్లు అనుకుందో, ఎంత కుమిలిపోయిందో!

ఈసారికూడా రాజేశ్వరి తల వంచక తప్పలేదు. ఇక తనచేత ఏదీ కాదనుకుని నిర్లిప్తంగా అంగీకరించింది.

రాజేశ్వరి స్కూలుచదువు అయిపోగానేమానిపించేసింది

వెంకమ్మగారు. రాజేశ్వరికూడా చదువుమీద ఎక్కువ ఆసక్తి చూపలేకపోయింది. రోజురోజుకూ బలవత్తరమవుతూన్న ఈజైలుగోడలనించి తప్పించుకోడ మెలాగా అనే ఆలోచనే ఎప్పుడూను.

పదిహేనేళ్ళ రాజేశ్వరి పెళ్ళి అంటే బ్రహ్మానంద పడింది. ఒకటే కారణం. ఈ బందిఖానాలోనించి బయటపడవచ్చని. కాని తరవాత తెలిసిన విషయాలతో మళ్ళీ నిరుత్సాహం ప్రవేశించింది.

"రాజీ! మా బాబాయిగారి రెండోవాడు లేడూ, రాజా, వాడు డాక్టరీ చదువుతున్నాడు. చక్కగా దొరలా ఉంటాడు. . ."

ఈ ఉపోద్ఘాతం ఎందుకో రాజేశ్వరికి అర్థమయింది. విసురుగా లేచి వెళ్ళిపోవాలని అనుకుంది. కాని ఇంకో ఆలోచన రాగానే ఆగిపోయింది. ఈవిడిని ఆశపెట్టి, కొండ ఎక్కించి ఒక్క ని తోసెయ్యాలి. 'నా కిష్టం లేదు' అని ఆఖరిన చెబితే, అబ్బ! ఈవిడ ముఖం మాడిపోతుంది.' వక్రంగా ఆలోచించిన రాజేశ్వరి ఇష్టాన్ని సూచిస్తూ లేచిపోయింది.

రాజేశ్వరి పెళ్ళిప్రయత్నాలు మొదలయ్యాయి. ఇంకా మూడు నాలుగు రోజులకు అంతా వెంకమ్మగారి పినతండ్రి ఇంటికి వెళ్ళారి. అక్కడే పెళ్ళి.

రాజేశ్వరికి వెంకమ్మగారిని ఏడిపించాలనయితే ఉంది గాని, ఎలా మొదలుపెట్టాలో అర్థంకాలేదు. తీరా నా కిష్టంలేదు అని చెప్పేస్తే, ఆవిడ ఇంట్లోనించి బయటకు గెంటేసినా గెంటెయ్యగలదు. అప్పు డేం చెయ్యాలి?

తమ్ముడితో ఆలోచించింది ఏమిటి చెయ్యడమా అని. లక్ష్మీనారాయణకికూడా తల్లి అంటే కోపమే, ప్రతిపనికీ ఆంక్షపెడుతుందని, స్వేచ్ఛ ఇవ్వదనీను. వాడు సుబ్బిగాడిని అడుగుదామన్నాడు.

సుబ్బిగాడు వెంకమ్మగారింట్లోనే మూలగదిలో ఉంటున్నాడు. కాలేజీలో చదువుతున్నాడు. రాజేశ్వరి తండ్రికి దూరపుబంధువు. అతడి తల్లి వరసకి చెల్లెలవుతుంది రాజేశ్వరి తండ్రికి.

"ఓరే, సుబ్బీ! పిన్నిని ఎలాగయినా ఈసారి చిత్తయిపోయేటట్టుగా కొట్టాలిరా! నాకేం తెలీటం లేదు. నువ్వు చెప్పు ఏం చెయ్యాలో?" రాజేశ్వరి అంది.

సుబ్బీ అనబడే సుబ్బారావు తెల్లమొహం వేశాడు. కాలేజీలో చదువుతున్నాడేకాని, స్కూలుపిల్లాడి కున్నంత లౌక్యంకూడా లేదు అతనికి.

రాజేశ్వరి, లక్ష్మీనారాయణ, సుబ్బారావు చాలాసేపు తలలు పగులగొట్టుకుని ఆలోచించారు. ఎవరికీ ఏంచెయ్యాలో తోచలేదు.

మరునాడు లక్ష్మీనారాయణ ఒక ఆలోచన చెప్పాడు. "నువ్వు, సుబ్బారావు రేపు రాత్రి వాళ్ళ ఊరు వెళ్ళి పోతారు. ఆ తరవాత సూరమ్మత్త ఇంట్లోనే ఉంటావు నువ్వు. ఆవిడికి నువ్వంటే ఎంతో ఇష్టం కదా."

ఈ ఆలోచన బాగానే ఉంది రాజేశ్వరికి. కాని సుబ్బిగాడితో వెళ్ళడమంటే ఎలాగో ఉంది.

"మరి, అమ్మకి చెప్పాలి కదా!"

"చెప్పవచ్చు. ఇంకో గంటకి వెళతారనగా చెప్పి బయలుదేరండి. బొగ్గులా మాడిపోతుంది ఆవిడ మొహం." సుబ్బారావు అన్నాడు.

ఒక పూట ఆలోచించిన తరవాత రాజేశ్వరికి



ఉల్లాసం
ఫోటో—ఆర్. పి. బన్సల్ (నసీరాబాద్)

ఇంతకన్న మంచి ఉపాయం లేదనిపించింది.

ఆ రాత్రి రైలుకు వెళ్ళడానికి నిశ్చయమయింది. అనుకున్న ప్లాను ప్రకారం సుబ్బారావు, రాజేశ్వరి ఒకపక్కా, లక్ష్మీనారాయణ ఒకపక్కా నిలబడ్డారు. గబుక్కున చెప్పేశారు సుబ్బారావు, రాజేశ్వరుల ప్రయాణం గురించి.

వాళ్ళు ఆశించినట్టు ఆవిడ ముఖంలో పెద్ద మార్పేమీ రాలేదు. ముగ్గురూ కొంచెం నిరాశ పడ్డారు.

"అయితే ఎందుకు వెడుతున్నట్టు?" రాజేశ్వరిని అడిగింది ఆవిడ. రాజేశ్వరికి భయం పోయింది, ఆవిడేదో అరిచి హంగామా చేస్తుందనుకుంటే, ఏమీ చెయ్యనందుకు.

"నాకు ఈ పెళ్ళి ఇష్టంలేదు. మీ బందిఖానాలో పదిహేనేళ్ళు అష్టకష్టాలు పడ్డాను. ఇష్టమైన తిండి తినడానికి లేదు. బట్ట కట్టడానికి లేదు. నవ్వడానికి లేదు. ఏడవడానికి లేదు. ఆఖరికి చదువులోకూడా స్వాతంత్ర్యం లేదు. నువ్వు నన్ను విషం పెట్టి చంపలేదుకాని అంతకన్న ఎక్కువే బాధపెట్టావు. నీ ఆలనలో ఉండి ఉండీ నా మనస్సు చిలికిపోయింది. నీ అధికారంతో విసుగెత్తిపోయింది. చావులాటి ఈ పెళ్ళితో మళ్ళీ నేను మీవాళ్ళలోనే, మీ అధికారం కిందే ఉండలేను. నేను కాబట్టి ఇన్నాళ్ళూ ఓపిగ్గా నువ్వు పెట్టిన ఆరడి తట్టుకున్నాను. కాని, ఇంకొక ళ్ళయితే ఉరిపోసుకుని చచ్చేవాళ్ళు."

నాగుపాము విషం కక్కి తేలికపడ్డట్టుగా ఉంది రాజేశ్వరి మనస్సు. ఇంకా అనాలని, ఇంకా బాధించాలని అనుకుందిగాని మాటలు, ఆలోచనలు పొడి అయిపోయాయి.

వెంకమ్మగారు రాజేశ్వరి అన్న మాటలకు ఆశ్చర్య పోయింది. మొట్టమొదటిసారిగా ఓడిపోయిన సైన్యాధిపతిలా అవమానం పొందింది. అయినా సన్నెత్తి ఒక్క మాట మాట్లాడలేదు.

తాము ఊహించిన పరివర్తన ఆవిడలో రావడంతో సంతృప్తిపడి వెళ్ళిపోయింది రాజేశ్వరి.

అదే ఆఖరిసారి తల్లినీ, తమ్ముడినీ చూడడం రాజేశ్వరి. రాజేశ్వరి, సుబ్బారావు వాళ్ళ ఇంటికి వెళ్ళడం, వాళ్ళిద్దరికీ పెళ్ళి అవడం అంతా కలలా జరిగిపోయింది. సుబ్బారావుతో పెళ్ళి అవడం రాజేశ్వరికి విచిత్రం అనిపించేది. సుబ్బారావును తను పెళ్ళికాక పూర్వం బాగానే ఎరుగును కాని ముందుకి అతడే తన భర్త అవుతాడనిగాని, అసలు అటువంటి భావాలుగాని లేవు. కాని పట్టుదలవల్ల రాజేశ్వరి సుబ్బారావు భార్య కావలసి వచ్చింది. అందుకు చింతించవలసిన అగత్యం కలగనివ్వ లేదు రాజేశ్వరికి సుబ్బారావు.

ఇక జీవితంలో లేవదనుకున్న వెంకమ్మగారు రాజేశ్వరి కొట్టిన దెబ్బనుండి తొందరగానే బయట పడ్డది. లక్ష్మీనారాయణకి పెళ్ళి చేసినట్టుమాత్రం తెలుసు రాజేశ్వరికి. తరవాత రాజేశ్వరి దాదాపు వాళ్ళని మరిచిపోయిందనే చెప్పాలి.

టెలిగ్రామ్ మనిఆర్డరు రెండురోజుల్లో ఏమై ఉంటుందా అని ఆలోచిస్తూన్న రాజేశ్వరి ఆలోచన తెలుసుకున్నట్టు ప్రత్యక్షమయ్యాడు టెలిగ్రాఫ్ మెసెంజర్.

ఏ యాభయ్యో, వందో పంపిస్తాడనుకున్న రాజేశ్వరి అయిదు వందలూ ఆశ్చర్యంగా అందుకుంది.

అవసరం అభిమానాన్ని చంపుతుంది. డబ్బు తీసుకున్న రాజేశ్వరికి ఎన్నో సమస్యలు పరిష్కార మయ్యాయి.

పెంకుటిల్లుస్థానే మూడంతస్తుల భవనం చూడగానే రాజేశ్వరి ఆశ్చర్యపోయింది. రాజేశ్వరికి జ్ఞాపకమున్న పరిసరాలు పూర్తిగా మారిపోయాయి. కొన్ని ఇళ్ళు మేడలయ్యాయి. ఉన్న ఇళ్ళు కొన్ని నేలమట్టమయ్యాయి.

లక్ష్మీనారాయణ కన్నీళ్ళతో పలకరించాడు రాజేశ్వరిని. సుబ్బారావును "ఒరే సుబ్బీ" అన్నాడు. లక్ష్మీనారాయణ భార్యకూడా ఆదరంగా ఆహ్వానించింది.

వెంకమ్మగారు రాజేశ్వరిని చూడగానే లేవాలని ప్రయత్నించింది. కాని, లేవలేకపోయింది. మనిషి బాగా కృశించిపోయింది. మొహం అంతా పీక్కుపోయింది. లోతుకుపోయినా కళ్ళల్లోనించి గోళీకాయల్లా మెరుస్తూన్నాయి కళ్ళు. ఆ కళ్ళలో లీలగా నీళ్ళు మెరవడం రాజేశ్వరికితప్ప ఎవరికీ కనిపించలేదు.

జాలివల్ల ఆవిడమీద ఉన్న కోపం కరిగిపోయింది రాజేశ్వరికి. దగ్గిరికి వెళ్ళి, మీద చెయ్యి వేసి "అమ్మా" అని పిలిచింది.

వెంకమ్మగారు చాలా తృప్తిపడ్డట్టు కనిపించింది. చిరాకు మాయమయి ప్రశాంతంగా ఉంది ముఖం.

రాజేశ్వరి కొడుకు గోపాలాన్ని, విజయలక్ష్మిని, ఆఖరి పిల్లని చూపించింది. ఆవిడ పరిచయమున్నట్టుగా వాళ్ళు ఇదివరకే తనకు తెలుసన్నట్టుగా చూసి ఏదో గొణిగింది.

మూడు రోజులు గడిచిపోయాయి. చిన్నప్పటి విషయాలు, తన కోపం అన్నీ మరిచిపోయి రాజేశ్వరి వెంకమ్మగారికి సేవ చేసింది. కొందరిని ప్రేమ దగ్గిరికి తీసుకువస్తే, కొందరిని చావు దగ్గిరికి తెస్తుంది.

ఇంకో ఘడియకి శ్వాస విడుస్తుందనగా వెంకమ్మ గారు గోపాలాన్ని, విజయలక్ష్మిని దగ్గిరికి రమ్మని సైగ చేసింది. ఏదో చెప్పింది. గొంతుకలో గురగుర

